ఎరువులు కరువు!

కూటమి పాలనలో రైతులకు తప్పని తిప్పలు
- ఏడాదిగా రైతు సేవా కేంద్రాలకు సరఫరా కాని యూరియా
- అన్నదాతల ఇబ్బందులపై దృష్టి సారించని పాలకులు
- డీలర్ల వద్ద అధిక ధరకు యూరియా కొంటున్న రైతులు





కంభం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి చేపట్టిన నాటి నుంచి రైతులకు తిప్పలు తప్పడం లేదు. రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చడం మినహా వాటి ద్వారా అందిస్తున్న సేవలను నిలిపేయడంపై రైతులు భగ్గుమంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచలేదు. దీంతో గత్యం తరం లేక బయట దుకాణాల్లో అధిక ధరకు యూరియా, ఇతర ఎరువులను రైతులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులను మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేయడంతో రైతులకు రవాణా ఖర్చులు, అధిక ధరలు, శ్రమ లేకుండాపోయాయి. ప్రస్తుతం ఆ పరిస్థితి గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 83 రైతు సేవా కేంద్రాల్లో ఎక్కడా కనిపించడం లేదు.

దృష్టి సారించని ప్రభుత్వం

రైతులు అన్ని రకాల పంటలకు ఎక్కువగా యూరియాను వినియోగిస్తుంటారు. నియోజకవర్గంలో ప్రస్తుతం పత్తి, మొక్కజొన్న, కొర్ర, కూరగాయల పంటలతోపాటు కంభం చెరువు ఆయకట్టు కింద, కొమరోలు, గిద్దలూరు మండలాల్లో అరటి సాగులో ఉంది. గతంలో ఆర్బీకేల్లో యూరియా బస్తా రూ.266కు ఇచ్చేవారు. ఎరువుల పంపిణీ నిలిపేయడంతో బయట మార్కెట్‌లో రూ.320 నుంచి రూ.350 వెచ్చించి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతులకు సరిపడా యూరియా మార్కెట్‌లో లభించడం లేదు. ప్రభుత్వం అదేమీ పట్టించుకోకుండా మౌనం దాల్చడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బయట మార్కెట్‌లోనూ యూరియా కొరత

బయట మార్కెట్‌లో డీలర్లకు సైతం యూరియా సక్రమంగా సరఫరా కావడం లేదని దుకాణదారులు చెబుతున్నారు. కంపెనీల నుంచి యూరియా కొనుగోలు చేసే సమయంలో నానో, కాంప్లెక్స్ ఎరువులు కూడా తీసుకోవాలని ఒత్తిడి చేస్తుండటంతో అదనపు భారం పడుతోందని డీలర్లు వాపోతున్నారు. బయట మార్కెట్‌లో యూరియా కొరత తలెత్తడం, రైతు సేవా కేంద్రాల్లో పూర్తిగా నిలిచిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొందరు డీలర్లు తమ వద్ద నిల్వ ఉన్న యూరియాను ఎమ్మార్పీ కంటే అదనంగా రూ.70 నుంచి రూ.80కు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

అధిక ధర పెట్టాల్సి వస్తోంది



ప్రస్తుతం మొక్కజొన్న, పత్తి వేస్తున్నాం. గతంలో రైతు సేవా కేంద్రంలో యూరియా కొనుగోలు చేసేవాళ్లం. ప్రస్తుతం అక్కడ యూరియా లేదని చెబుతున్నారు. బయట దుకాణాల్లో బస్తాకు రూ.80 అదనంగా పెట్టాల్సి వస్తోంది. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం యూరియా అందించాలి.
– అడపాల ఆంజనేయులు, రైతు, రావిపాడు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వం రైతులకు ఇబ్బంది లేకుండా గతంలో మాదిరిగా రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలి. రైతులు పట్టణాలకు వచ్చి ఎరువులు కొనుగోలు చేసి తీసుకెళ్లాలంటే అదనపు ఖర్చులు, శ్రమ. అధికారులు, ప్రభుత్వం స్పందించి రైతులకు యూరియా అందించే ఏర్పాటు చేయాలి.
– గొంగటి చెన్నారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, కంభం

రైతు సేవా కేంద్రాల్లో యూరియా లేదు



రైతు సేవా కేంద్రంలో యూరియా అందుబాటులో ఉంచడం వల్ల రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. బయట మార్కెట్‌లో యూరియా కొనాలంటే అధిక ధర చెల్లించాల్సి వస్తోంది. ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు అదనపు భారంగా మారాయి.
– కె.రమణారెడ్డి, రైతు, కంభం

ఉత్కంఠగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ


పోటీలో తలపడుతున్న జట్లు

కొనకనమిట్ల: మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ మర్రిపాలెం గ్రామంలో శనివారం ప్రారంభమైన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠగా సాగింది. పోటీల్లో మొత్తం 22 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు అన్నారు. గుర్రాలమడుగు–బిరుదలనరవ జట్ల మధ్య హోరాహోరీ పోరులో గుర్రాలమడుగు టీమ్ విజయం సాధించింది. రేగుమానిపల్లి–బి జట్టుపై అదే గ్రామానికి చెందిన ఏ జట్టు గెలుపొందింది. చౌటపల్లి జట్టుపై రేగుమానిపల్లి టీమ్ పైచేయి సాధించింది. టోర్నమెంట్ నిర్వహణకు సహాయ సహకారాలు అందించిన రేగుమానిపల్లి, మర్రిపాలెం గ్రామ దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీపై వెళ్లిన టీచర్లకు సన్మానం


గొట్లగట్టు జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జెడ్పీ హైస్కూల్ నుంచి బదిలీపై వెళ్లిన ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ బాలగురవయ్య, టీచర్లు విజయలక్ష్మి, ప్రభాకర్, ఆదాం, శార్వరి, సుబ్బారావు, కిషోర్ కుమార్, అరుణకుమారి, నరసమ్మ, పెద్దరాయుడు, ప్రేమ్‌కుమార్‌ను హెచ్‌ఎం ఆదినారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. అలాగే చినారికట్ల జెడ్పీ పాఠశాల నుంచి బదిలీ అయిన హెచ్‌ఎం కోటిరెడ్డి, ఉపాధ్యాయులు రమణయ్య, అబీదాబేగం, బాబు, నరసయ్యను హెచ్‌ఎం సుజాత, విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు.


చినారికట్ల జెడ్పీ పాఠశాలలో..

మాట తప్పిన కూటమి ప్రభుత్వం


పొదిలి డిపో గేట్ మీటింగ్‌లో ఆర్టీసీ ఉద్యోగులు

పొదిలి: కూటమి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో ఐఆర్ ఇస్తామని చెప్పి, ఏడాది గడిచినా మాట నిలబెట్టుకోకపోవడం సరికాదని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు విమర్శించారు. శనివారం డిపో వద్ద గేట్ మీటింగ్‌లో యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు మంజూరు చేయాలని, 11వ పీఆర్సీ అరియర్స్‌ను విడుదల చేయడంతోపాటు 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ సౌకర్యవంతంగా అమలు చేయాలంటే 300 బస్సులు అదనంగా ఏర్పాటు చేయాలన్నారు. ఎక్సెస్ పేరుతో పొదిలి డిపో నుంచి వెళ్లి ఇతర డిపోల్లో గత ఆరేళ్లుగా పనిచేస్తున్నవారిని మాతృ డిపోకు తీసుకురావాలన్నారు. దివాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఓబులేసు, కోశాధికారి ఎస్‌కే జిలానీ, గ్యారేజీ కార్యదర్శి సుబ్బారావు, మహిళా ఉద్యోగులు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మార్కాపురానికి బాబా పాదుకలు

మార్కాపురం: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న సాయిబాబా మందిరానికి ఆదివారం షిరిడీ నుంచి బాబా పాదుకలు రానున్నాయని మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు బాబా మందిరం నుంచి బాబా పాదుకల నగరోత్సవం నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో పీర్ల ఉత్సవం

మార్కాపురం టౌన్: స్థానిక పూలసుబ్బయ్య కాలనీలోని మకాన్‌లో కొలువుదీరిన పీర్ల ఉత్సవాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పీర్లను ఎత్తుకుని కాలనీలో ఊరేగించారు. భక్తులు పీర్లను దర్శించుకుని బొరుగులు, పప్పులను ఫాతేహాగా సమర్పించారు.


పూలసుబ్బయ్య కాలనీలో ఊరేగుతున్న పీర్లు

ఆసియా బుక్‌లో స్థానం అపూర్వం


మధుసూదన్ శర్మను సన్మానిస్తున్న అర్చకులు, వేదపండితులు

మార్కాపురం: కవి, రచయిత, వ్యాఖ్యాత, సాధనా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదనశర్మ ఆసియన్ అడ్మిరబుల్ అచీవర్స్ 2025లో స్థానం సంపాదించడం అపూర్వమని మార్కాపురం బ్రాహ్మణ, అర్చక పురోహిత సంఘ సభ్యులు కొనియాడారు. ఆసియన్ బుక్‌లో స్థానం సంపాదించిన సందర్భంగా కమిటీ సభ్యులు సన్మానించి, జగద్గురు ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. కార్యక్రమంలో అర్చకులు శివకుమార్ శర్మ, శ్రీపతి అప్పనాచార్యులు, భరద్వాజ శర్మ, వెలుదండ సుబ్రహ్మణ్యం, కె.ప్రసాద్ శర్మ, శివ శర్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఈఈగా శ్రీనివాసరావు

మార్కాపురం టౌన్: మార్కాపురం ఆర్‌అండ్‌బీ ఈఈగా తిరువీధుల శ్రీనివాసరావు నియమితులయ్యారు. శనివారం ఆయన తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. డీఈఈగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన పదోన్నతిపై మార్కాపురం ఈఈ వచ్చారు.

లోక్ అదాలత్‌లో 851 కేసుల పరిష్కారం

మార్కాపురం: మార్కాపురం జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 851 కేసులు పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం శుభవాణి, సీనియర్ సివిల్ జడ్జి దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కిశోర్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ ఆధ్వర్యంలో నాలుగు బెంచ్‌లె ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 32 సివిల్ కేసులు, 152 క్రిమినల్ కేసులు, 9 చెక్ బౌన్స్ కేసులు, 6 వివాహ సంబంధ కేసులు, 251 ఎక్సైజ్ కేసులు, 401 పెట్టీ కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారని వివరించారు. లోక్ అదాలత్ సభ్యులుగా బి.కాశయ్య, ఎస్‌కే బేగం కరీమున్నీసా, టి.వెలుగొండయ్య, వై.అనిల్‌కుమార్, కె.రామయ్య, సైదులునాయక్ వ్యవహరించినట్లు తెలిపారు. న్యాయవాదులు ఎంవీ నారాయణరెడ్డి, ఉషశ్రీ, జేఎస్ఆర్ కృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రేపు చీమకుర్తి గురుకులంలో కౌన్సెలింగ్

అర్ధవీడు: మండల కేంద్రమైన అర్ధవీడు, మార్కాపురం గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతిలో ప్రవేశానికి గత నెల 25న దర్శిలో నిర్వహించిన పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఉత్తీర్ణులైన విద్యార్థులు చీమకుర్తిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఈ నెల 7వ తేదీన కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని అర్ధవీడు గురుకులం ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి ఓ ప్రకటనలో సూచించారు. ఉదయం 9 గంటల నుంచి బాలికలకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి బాలురకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని వివరించారు.

7న ఒంగోలులో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సభ

కంభం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 7 న ఒంగోలులో నిర్వహించనున్న మాదిగ మహామేళ కార్యక్రమాన్ని విజయవంతం చేయలని సంఘ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్ కోరారు. శనివారం యర్రబాలెం గ్రామంలో మాదిగ మహామేళ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాస్కర్, శ్రీకాంత్ రాజు, ప్రసన్నకుమార్, బాబు, ప్రకాష్, నాగయ్య పాల్గొన్నారు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుల మినీ కిట్లు పంపిణీ

పొదిలి రూరల్: మండలంలోని అన్నవరంలో రైతులకు శనివారం కందుల మినీ కిట్లను ఎమ్మెల్యే నారాయణరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం పంటల బీమా పథకం పోస్టర్ ఆవిష్కరించారు. దర్శి ఏడీఏ బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. ఖరీఫ్ 2025కు సంబంధించి పంటల బీమాకు రైతు వాటా సొమ్మును రైతులే చెల్లించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, వీఏఏ నర్మద, అరుందతి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులతో సామాన్యులు విలవిల


డీటీకి వినతిపత్రమిస్తున్న సీపీఐ నాయకులు

బేస్తవారిపేట: అధిక విద్యుత్ బిల్లులు సామాన్యుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వి.జోసఫ్, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు డాకాల పుల్లయ్య పేర్కొన్నారు. పెంచిన విద్యుత్ బిల్లులు తగ్గించాలని కోరుతూ శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. డీటీకి వినతిపత్రాన్ని అందజేశారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో అధికంగా బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. విద్యుత్ సర్దుబాటు పేరుతో కూటమి ప్రభుత్వం వినియోగదారులపై రూ.15,485 కోట్లు భారం మోపడం సరికాదన్నారు. అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేవీ రమణ, జె.అంకయ్యలు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 10 వేల ఖాళీలు భర్తీ చేయాలి


గిద్దలూరు డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు


మార్కాపురం డిపో ఎదుట ధర్నాలో పాల్గొన్న ఆర్టీసి ఉద్యోగులు

- పీఆర్సీ కమిషన్‌ను నియమించి, అప్పటి వరకు ఐఆర్ ఇవ్వాలి
- డిపోల ఎదుట ధర్నాలో ఉద్యోగుల డిమాండ్

మార్కాపురం: తమ న్యాయమైన కోర్కెలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ ఉద్యోగులు రెండో రోజు శనివారం ఆర్టీసీ డిపోల ఎదుట ధర్నా చేశారు. మార్కాపురం డిపో ఎదుట ధర్నాలో యూనియన్ నాయకుడు ఎస్‌వీఎస్ శాస్త్రి మాట్లాడుతూ.. అర్హులైన ఉద్యోగులకు తక్షణమే ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల పోస్టులను భర్తీ చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను సంస్థ సొంతంగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బస్సులను ప్రైవేటు ఆపరేటర్లకు లీజుకు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలన్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దనరావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఐఆర్ తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు సంబంధించిన జీఓను యథావిధిగా అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఉన్నతాధికారులు కేఎంపీఎల్ పేరుతో డ్రైవర్లను వేధించడం మానుకోవాలని, చాలా కాలం నుంచి ఒకే సీటులో ఉన్న డిస్పాచ్ మెకానిక్, కేఎంపీఎల్ మెకానిక్‌లను మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి శేఖర్ నాయుడు, డిపో కార్యదర్శి నాని, ఏడీసీ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, శంకయ్య, జాకీర్ హుస్సేన్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ **గిద్దలూరు రూరల్:** స్థానిక డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు చక్రపాణియాదవ్ మాట్లాడుతూ.. డబుల్ డ్యూటీలు చేసే సిబ్బందికి ఇచ్చే డీడీ అమౌంట్ పెంచాలని, రిటైరైన ఉద్యోగులకు గ్రాడ్యుటీ, టెర్మినల్, ఎన్‌క్యాష్‌మెంట్‌ను తక్షణమే చెల్లించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్‌కు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బత్తుల తిరుపతయ్య, షేక్.జాఫర్, షేక్.బాషా, కొండారెడ్డి, బీఎస్ రెడ్డి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి


మార్కాపురంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

మార్కాపురం టౌన్/కంభం/గిద్దలూరు రూరల్: కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కోరారు. శనివారం మార్కాపురం, గిద్దలూరు పట్టణాల్లో నిర్వహించిన కార్మిక జాతాలో ఆయన మాట్లాడారు. 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు మార్పు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి అమలు చేయాలన్నారు. డిజైన్ స్లేట్ పరిశ్రమలో కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ మానుకోవాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

■ కంభంలో నిర్వహించిన కార్మిక జాతాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రఫీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు తెచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు రూబెన్, నాగరాజు, బాలశేషయ్య, అన్వర్, టి.అవులయ్య, పి.నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి డిపోలో జోనల్ చైర్మన్ తనిఖీ


వినతిపత్రం అందుకుంటున్న సురేష్‌రెడ్డి

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపో, గ్యారేజ్‌ను సంస్థ జోనల్ చైర్మన్ ఎస్.సురేష్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. బస్టాండ్‌లోని పలు విభాగాలను పరిశీలించి ప్రయాణికులతో మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం తరుపున వచ్చే బెనిఫిట్స్‌కు తమ వాటా చెల్లిస్తున్నామని, అయినా వారికి లబ్ధి చేకూరేలా స్థానిక అధికారులే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముందుగా ఆర్టీసీ డీఎం మల్లికార్జున శంకరరావు, యూనియన్ల నాయకులు, బీజేపీ నాయకులు మాగులూరి రామయ్య, బెల్లంకొండ విజయలక్ష్మి శ్రీనివాస్, దోర్నాల రమణారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. బస్సులు ఏర్పాటు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని నాయకులు వినతిపత్రాలు అందజేశారు.

ఆర్వో ప్లాంట్లలో నీరు సురక్షితమేనా?

- నాణ్యతను తనిఖీ చేయాలని అధికారులకు సూచించిన ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి, పక్కన ఎండీడీఓ

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని ఆర్వో ప్లాంట్లలో నీటి నాణ్యతను తనిఖీ చేసి ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బండి లక్ష్మీదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం పరిశీలించి, మోతాదు అధికంగా ఉన్న గ్రామాల ప్రజలకు సురక్షిత నీరు అందేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం కూలీల వద్ద అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కాపురం మండలంలోని నరసింహాపురం పరిధిలో ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. బొందలపాడులో ప్రభుత్వ పాఠశాల వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని స్థానిక సర్పంచ్ కోరగా ఎంపీడీఓ శ్రీనివాసులు సానుకూలంగా స్పందించారు. వివిధ సమస్యలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతోపాటు, ఏఓ బుజ్జిబాయి, వెటర్నరీ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ఏపీఓ నాగరాజు, హెచ్‌ఓ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, వైద్యశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెలుగొండలో విశేష పూజలు


శ్రీవారి పుష్కరిణిని పరిశీలిస్తున్న ఆర్డీఓ, భక్తులు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. శ్రీలక్ష్మీ అలివేలు మంగ సమేత వెలుగొండ వెంకటేశ్వరస్వామి వారికి అర్చకుడు సింహాద్రిచార్యులు పూజలు చేశారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారిని కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి పుష్కరిణిని అభివృద్ధి చేయాలని పలువురు భక్తులు ఆర్డీఓను కోరగా సానుకూలంగా స్పందించారు. ఆర్డీఓ వెంట ఎస్సై ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగుడికి ఆర్థిక సాయం


దివ్యాంగుడికి నగదు అందిస్తున్న నాయకులు

మార్కాపురం: కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన దివ్యాంగుడు ప్రగడా వెంకటేశ్వర్లు తన తల్లి అనారోగ్యంతో ఉందని, ఆదుకోవాలని చేసిన విజ్ఞప్తి మేరకు శనివారం వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు డి.గోపాల్‌రెడ్డి, ఎస్.రమణారెడ్డి, హరిప్రసాద్ తదితరులు ఆర్థిక సాయం అందించారు. వారికి వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా చెన్నకేశవస్వామి శాంతి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో ఉభయదేవేరులతో స్వామివారు

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామివారి శాంతి కల్యాణాన్ని శనివారం ఆలయ మధ్యరంగ మండపంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామివారిని వివిధరకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించారు. ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాయలసీమ జిల్లా నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సరికాదు


ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ నాయకులు అందె నాసరయ్య, ఖాసీం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలకు భారంగా మారిన నూతన విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వం పెంచిన సర్దిఫైడ్ విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుప్పట్ల కాశయ్య, శంకర్, లక్ష్మీనాయక్, వెంకటేశ్వర్లు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి బస్సులు నడపాలి


బస్సులో నిల్చుని ప్రయాణిస్తున్న విద్యార్థినులు

మార్కాపురం: పెద్దారవీడు మండలంలో ఉన్న కేంద్రీయ విద్యాలయానికి మార్కాపురం నుంచి 2 బస్సులు నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు మార్కాపురం ఆర్టీసీ డీఎంకు విజ్ఞప్తి చేశారు. సుమారు 115 మంది విద్యార్థులు అక్కడ చదువుతున్నారని, దేవరాజుగట్టు, గొబ్బూరు, తోకపల్లి నుంచి 50 మంది పిల్లలు అదనంగా ఎక్కుతారని, ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు, ఆ తరువాత 7.30 గంటలకు మార్కాపురం డిపో నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఒక బస్సు మాత్రమే ఉందని, ఆ బస్సు కూడా బి.చెర్లోపల్లి మీదుగా వెళ్తుండటంతో ఎక్కువ మంది పిల్లలు వెళ్లడం లేదని డీఎం దృష్టికి తీసుకెళ్లారు. రెండు బస్సులు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు నిల్చుని వెళ్లే ఇబ్బందులు తప్పుతాయని డీఎంను కోరారు.

మెగా పేరెంట్స్ సమావేశంలో పాల్గొనాలి


మాట్లాడుతున్న ఎంఈఓ రమణారెడ్డి

బేస్తవారిపేట: విద్యార్థుల తల్లిదండ్రులు ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్స్ సమావేశంలో పాల్గొనాలని ఎంఈఓ చేగిరెడ్డి రమణారెడ్డి కోరారు. శనివారం స్థానిక ఎంపీఎస్ మెయిన్ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు సమావేశానికి తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.